epaper.republichindustan.in

RNI REG.NO. TELTEL/2021/83468

# రిపబ్లిక్ హిందుస్థాన్

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 353 వెల : 5/-

గురువారం | 19.12.2024 | ఆదిలాబాద్ | నిజామాబాద్ | వరంగల్ | మంచిర్యాల | ఆసిఫాబాద్ | నిర్మల్ | మహబూబాబాద్ హైదరాబాద్ www.republichindustan.in

## రైతులతో కలిసి ప్రధానమంత్రిని కలిసిన రాజ్యసభ ఎంపీ శరద్ పవార్



ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో రాజ్యసభ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి శ్రీ శరద్ పవార్ ఈ రోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శరద్ పవార్ వెంట కొంతమంది రైతులు కూడా ఉన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధానమంత్రి కార్యాలయం ఇలా పేర్కొన్నది.

"రాజ్య సభ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి శ్రీ శరద్ పవార్ రైతు బృందంతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీతో (@narendramodi) ఈ రోజు సమావేశమయ్యారు.

# త్వరలో తెలంగాణ ఆర్టీసీలో 3,039 ఉద్యోగాలు



హైదరాబాద్, డిసెంబర్ 18 ; టీజీఎస్ఆర్టీసీలో కొత్తగా 3,039 ఉద్యోగాలను త్వరలోనే భర్తీ చేయను న్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీలో వెల్లడించారు. అసెంబ్లీలో సభ్యులు వివేక్, ఆది శ్రీనివాస్,పాల్వాయి హరీష్,అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ... జిల్లా కేంద్రాలకు లింకు రోడ్లు ఏర్పాటు చేయాలని టార్గెట్ పెట్టుకు న్నామని, తెలిపారు మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు సంతోషంగా ఉచిత ప్రయాణం చేస్తు న్నారని, దీంతో బస్సులకు డిమాండ్ పెరిగిందన్నారు. అందువల్ల రాష్ట్రంలో కొత్త రూట్లను కూడా పెంచుతా మన్నారు వేములవాడ, ధర్మపురి, కొండగట్టు క్షేత్రాల ను కలుపుతూ బస్సుల లింకింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర ఆవిర్భావం సమ యంలో ఆర్టీసీలో 55,000 మంది ఉద్యోగులుంటే, ప్రస్తుతం 40,000 మంది ఉన్నారని చెప్పారు. 15 ఏళ్లు దాటిన బస్సులను స్క్రాప్‌కు పంపిస్తున్నామ న్నారు.

## అందుకే కేంద్రమంత్రులను కలుస్తున్నాం: భట్టి



హైదరాబాద్ :

అందుకే కేంద్రమంత్రులను కలుస్తున్నాం: భట్టి సమాఖ్య స్ఫూర్తిని గౌరవిస్తూ చట్ట ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధుల వాటా ఇవ్వాలని కోరుతున్నామని.. అందుకే కేంద్రమంత్రులను కలుస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం శాసనమండలిలో MLC కవిత ప్రశ్నలకు భట్టి సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం పదేళ్లలో సాధించిన దాని కంటే తమ ప్రభుత్వం కేంద్రం నుంచి అధికంగా నిధులు సాధించిందన్నారు. BRS , తమ హయాంలో కేంద్రం నుంచి వచ్చిన నిధుల వివరాలను భట్టి తెలిపారు.

## మహా కుంభమేళా ఉచిత ప్రయాణంపై వివరణ



మహా కుంభమేళా సందర్భంగా ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించినట్లు కొన్ని మీడియా సంస్థలు కథనాలు ప్రసారం చేస్తున్న విషయం భారతీయ రైల్వే దృష్టికి వచ్చింది.

## భారతదేశంలో భాషా వారసత్వాన్ని అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ నిబద్ధత

- ఈ విషయంలో ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉంది: కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి
- అయిదు భాషలకు శాస్త్రీయ భాషా హోదాను ఇవ్వడం
- ఈ నిబద్ధతను చాటిచెబుతోంది: జి. కిషన్ రెడ్డి
- 'భారతీయ భాషలను ప్రోత్సహించడంలో
- ఎన్ఈపీ 2020 ఒక పరివర్తన పూర్వక చర్య': కేంద్ర మంత్రి



కేంద్ర ప్రభుత్వం భారతదేశంలో సుసంపన్న భాషా వారసత్వాన్ని పరిరక్షించాలన్న, ప్రోత్సహించాలన్న, అభివృద్ధి చేయాలన్న నిబద్ధత విషయంలో దృఢనిశ్చయంతో ఉందని కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన ఈరోజు పత్రికా విలేకరుల సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, 2047 కల్లా అభివృద్ధి చెందిన భారతదేశాన్ని ఆవిష్కరించాలన్నదే ప్రభుత్వ దృష్టికోణమని తెలిపారు. దేశ సాంస్కృతిక అభివృద్ధికి,

3 లో

## ఆర్థిక నేరాల నియంత్రణకు కృషి చేయాలి

- జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్.



- మావల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.
- నేరాల కట్టడిలో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ఉండాలి.
- గ్రామ, వార్డు పోలీసు వ్యవస్థను పటిష్టం చేయాలి.

రిపలిక్ హిందుస్థాన్ , ఆదిలాబాద్ : స్టేషన్ రికార్డులు, సిబ్బంది పనితీరు, పరిసరాలు, డ్రిల్ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ. వార్షిక తనిఖీల్లో భాగంగా ఈరోజు ఉదయం స్థానిక మావల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఐపిఎస్. ఈ సందర్భంగా మొదటగా పోలీస్ స్టేషన్ ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, సీఐ కె ఫనిధర్, మావల ఎస్ హెచ్ ఓ వి విష్ణువర్ధన్, జిల్లా ఎస్పి గారికి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. తదుపరి స్టేషన్ ఆవరణలో జిల్లా ఎస్పీ గారి చేతుల మీదుగా ఒక మొక్కని నాటడం జరిగింది. స్టేషన్ సిబ్బంది ద్వారా ఏర్పాటు చేసిన డ్రిల్ ను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. తదుపరి స్టేషన్ ఆవరణను, పరిసరాలను పరిశీలించి స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ ను పరిశీలించి ప్రతిరోజు పోలీస్ స్టేషన్ ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి రిసెప్షన్, సాంకేతిక నిపుణుల పనితీరు, ఉమెన్ హెల్ప్ డెస్క్, సిబ్బంది వేచి ఉండు గది, స్టోర్ రూమ్, రికార్డు రూమ్ లను పరిశీలించారు. తదుపరి స్టేషన్ లో నమోదైన కేసుల వివరాలను తెలుసుకొని వాటి ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. స్టేషన్లో ఇప్పటివరకు నమోదైన సైబర్ క్రైమ్ బాధితుల వివరాలు, సిఈఐఆర్ ద్వారా తిరిగి అందించడం మొబైల్ ఫోన్ల వివరాలు, ఫింగర్

2 లో

## నేటి రాశి ఫలాలు - 19-12-2024

4 వ పేజిలో

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే

## ప్రక్రియను సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా.

**రిపబ్లిక్ హిందుస్థాన్ , ఆదిలాబాద్ :** ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పాలనాధికారి రాజర్షి షా అన్నారు.

జిల్లా కేంద్రం లోని భుక్తాపూర్ వార్డ్ నెంబర్ 44, 49 లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను జిల్లా పాలనాధికారి ఆకస్మికంగా సందర్శించి నమోదు చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేయర్లు ఇంటింటికీ తిరుగుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రజాపాలన లో దరఖాస్తులు చేసుకున్న అర్జీదారుల వివరాలను సేకరిస్తున్న తీరును పరిశీలించి గడువులోగా పూర్తి



*ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా*

చేయాలని, రోజువారి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ రోజు ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేశారు, సర్వే సందర్భంగా యాప్ ద్వారా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, పొరపాట్లకు

2 లో



## వలసదారుల హక్కులను పరిరక్షించాలి

రిపబ్లిక్ హిందుస్థాన్ , మంచిర్యాల : వలసదారుల హక్కులను పరిరక్షించడం మన అందరి సామూహిక బాధ్యత అని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు, హ్యూమన్ రైట్స్ ఆక్టివిటిస్ట్ అవార్డు గ్రహీత డా. రాజలింగు మోతే అన్నారు. బుధవారం అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు.తక్కువ ఉపాధి అవకాశాలు, దారిద్ర్యం వలన వేలాదిమంది మెరుగైన జీవనోపాధి కోసం లేదా భద్రత కోసం,కొంతమంది జీవితం కోసం శరణార్థులుగా కొత్త ప్రాంతాలకు వెళ్తున్నారని అన్నారు. వలసదారులు వారి మేధస్సును, సాంకేతిక నైపుణ్యాలను వారు ఆశ్రయించిన ప్రాంతానికి, సమాజానికి అందిస్తారని అన్నారు. అయితే వారు వలస వెళ్లిన ప్రాంతాలలో వివక్షకు గురవుతున్నారని అన్నారు.తక్కువ వేతనాలు,నిస్సహాయ పరిస్థితులు, చట్టపరమైన రక్షణ లోపం కారణంగా వారు తీవ్ర కష్టాలను అనుభవిస్తున్నారని అన్నారు. వారి కష్టాలను గుర్తించి,వారిపై ఉన్న అపనమ్మకాన్ని తొలగించడానికి ప్రభుత్వాలు, సమాజం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ నాయకులు చాకిటి రమేష్, ఎల్బీ సదానంద ,మామిడి సంపత్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి భాగం



ఈ నివేదికలు పూర్తిగా నిరాధారమైనవని, తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని భారతీయ రైల్వే నిర్ద్వంద్వంగా ఖండించింది.

చెల్లుబాటు అయ్యే టికెట్ లేకుండా ప్రయాణించడం భారతీయ రైల్వే నియమ నిబంధనల ప్రకారం నిషిద్ధం, అది శిక్షార్హమైన నేరం కూడా. మహా కుంభమేళా లేదా మరే ఇతర సందర్భంలోగానీ.. ఉచిత ప్రయాణానికి సంబంధించి ఎలాంటి వెసులుబాటూ లేదు.మహా కుంభమేళా సందర్భంగా ప్రయాణికులకు నిరంతరాయంగా ప్రయాణ సేవలందించడానికి భారతీయ రైల్వే కట్టుబడి ఉంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా.. వారు వేచి ఉండేందుకు అదనంగా ప్రత్యేక ప్రాంతాలు, అదనపు టికెట్ కౌంటర్లు సహా అవసరమైన ఇతర ఏర్పాట్లను చేస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి భాగం

## ఆర్థిక నేరాల నియంత్రణకు కృషి చేయాలి

ఫ్రింట్, డ్రంక్ అండ్ డ్రైవ్, సిబ్బంది యొక్క అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే కిట్లు, కేసు హిస్టరీ సీట్లు, రౌడీ షీట్లు, 5యస్, రికార్డుల నిర్వహణ, డయల్ హండ్రెడ్, పెట్రో కార్, బ్లూ కోర్ట్, రౌడీ షీట్లు తదితరాలపై పూర్తి విచారణ చేపట్టారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా నేరాలు నమోదవుతున్న ప్రాంతాలలో అధికంగా గస్తీ నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. దొంగతనాల నివారణకు రాత్రి సమయాల్లో బీట్లు ఏర్పాటు చేసి నియంత్రించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సిబ్బందిని కేటాయించి వాటి ని అరికట్టాలని సూచించారు. ప్రమాదాల నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా ఖచ్చితమైన నిఘా వ్యవస్థను అభివృద్ధి చేసుకొని ఉండాలని సూచించారు. సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించినప్పుడు ఎలాంటి నేరాలు జరగకుండా, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కె ఫణిదర్, మావల ఎస్ హెచ్ ఓ వి విష్ణువర్ధన్, ఎస్సై పవర్ గౌతమ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




మొదటి పేజీ తరువాయి భాగం

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా పాలనాధికారి

తావులేకుండా దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్ మొబైల్ యాప్ లో జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు.

నిర్లక్ష్యం వహించకుండా ఈ నెలాఖరు లోగా సర్వే పూర్తయ్యేలా వేగవంతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ cvn రాజు, సర్వేయర్లూ, తదితరులు ఉన్నారు.



బుధవారం జిల్లా కేంద్రం లోని భూక్తా పూర్ వార్డ్ నెంబర్ 44, 49 లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్ ద్వారా వివరాలు నమోదు చేస్తున్న తీరును పరిశీలిస్తున్న జిల్లా పాలనాధికారి రాజర్షి షా.

## డిసెంబర్ 29 నుంచి రాష్ట్రపతి నిలయంలో 15 రోజుల పాటు పుష్ప, ఉద్యానోత్సవాలు

రిపబ్లిక్ హిందుస్థాన్ , హైదరాబాద్ :




సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఈ నెల 29 నుంచి 15 రోజుల పాటు 'ఉద్యాన్ ఉత్సవ్' పేరుతో పుష్ప, ఉద్యానోత్సవం జరగనుంది. వ్యవసాయ - రైతు సంక్షేమ విభాగం, హైదరాబాద్ లోని జాతీయ వ్యవసాయ విస్తరణ నిర్వహణ సంస్థ (మేనేజ్), భారత వ్యవసాయ పరిశోధన మండలి సహకారంతో ఉద్యాన్ ఉత్సవ్ నిర్వహిస్తున్నారు. ప్రకృతి వనరుల ఆవశ్యకతను చాటడం, ప్రజా భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ, సుస్థిరతలను ప్రోత్సహించడం దీని లక్ష్యం. వివిధ అంశాలకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించడం, సదస్సులో పాల్గొనడం ద్వారా..



వ్యవసాయం, ఉద్యాన అంశాల్లో నూతన ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధిపై ప్రజలు అవగాహన పెంచుకోవచ్చు.




ఉద్యాన్ ఉత్సవ్ సన్నాహాలు, సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం సమీక్షించారు. రాష్ట్రపతి నిలయంలోని సందర్శకుల సేవా కేంద్రంలో తినుబండారాల మిట్టీ కేఫ్ ను, సావనీర్ షాప్ ను ఆమె ప్రారంభించారు. ప్రాంగణంలోని కంపోస్టు విభాగాన్ని కూడా ఆమె సందర్శించి కంపోస్టు తయారీ ప్రక్రియను పరిశీలించారు. తోటలోని వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువును ఉత్పత్తి చేయడం ద్వారా ఈ కంపోస్టింగ్ యూనిట్ ఆదర్శంగా నిలుస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రపతి దక్షిణాది పర్యటన సమయంలో తప్ప, ఏడాది పొడవునా రాష్ట్రపతి నిలయంలో ప్రజల సందర్శనకు అనుమతి ఉంటుంది. https://rashtrapatibhavan.gov.in ద్వారా సందర్శకులు అనుమతి పొందవచ్చు.

మొదటి పేజీ తరువాయి భాగం

# భారతదేశంలో భాషా వారసత్వాన్ని అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ నిబద్ధత

జాతీయ ఏకత పరిరక్షణలో భాషల పాత్ర కీలకమని ఆయన అన్నారు. భాషల పరంగా చూసినప్పుడు ఎంతో వైవిధ్యంతో కూడిన ఒక విశిష్ట నమూనా మనదని, మన దేశంలో భాషలు ఒక్క సందేశ ప్రసార సాధనాలే కాకుండా, జ్ఞానం, సంస్కృతి, సంప్రదాయాల అమూల్య భాండాగారాలుగా కూడా ఉన్నాయని ఆయన అన్నారు.

చరిత్రను పరిశీలిస్తే రాజకీయ ప్రయోజనాలను సాధించడానికి భాషలకు కీలక స్థానాన్ని కట్టబెట్టారని, ప్రాంతీయ భాషలను అణగదొక్కేందుకు ప్రయత్నాలు చేసి, ప్రజల వాక్ స్వాతంత్ర్యానికి పరిమితులు విధించాలని చూశారని ఆయన అన్నారు. ఉదాహరణకు చెప్పుకోవాలంటే 1835లో మెకాలే విధానాలు భారత శాస్త్రీయ భాషలను పక్కదారి పట్టించి, విద్యా బోధన మాధ్యమంగా ఇంగ్లిషును ప్రోత్సహించడంతోపాటు ఐరోపాకు చెందిన జ్ఞాన వ్యవస్థలకు పెద్దపీట వేశాయన్నారు. చరిత్రలో ఎదురైన సవాళ్ళను ప్రభుత్వం గుర్తించి, ప్రాంతీయ భాషలను పరిరక్షించడానికి నిరంతరం కృషి చేస్తోందని, సాధికారత కల్పనకు, స్వీయ భావవ్యక్తీకరణకు ప్రాంతీయ భాషలను శక్తిమంతమైన సాధనాలుగా చూసిందని మంత్రి అన్నారు. శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయీ చెప్పినట్లు, “భాష కేవలం భావవ్యక్తీకరణ కు ఒక సాధనం అనే కాక అది మన సంస్కృతికి ఆత్మ కూడా”నని మంత్రి గుర్తు చేశారు.

రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూలులో భాషలను చేర్చడం ఈ దిశలో చేపట్టిన ఒక ముఖ్య చర్యని శ్రీ కిషన్ రెడ్డి అన్నారు. మొదట్లో ఎనిమిదో షెడ్యూలులో 14 భాషలను చేర్చగా, ప్రస్తుతం వాటిని 22 వరకు విస్తరించడం భారతదేశ వైవిధ్యానికి అద్దంపడుతోందన్నారు. 1967లో సింధీని ఎనిమిదో షెడ్యూలులో చేర్చారని, ఆ సందర్భంగా శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయీ ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ, ‘నేను మాట్లాడే భాష హిందీ, అయితే సింధి నా ‘మౌసీ’ (అమ్మమ్మ)’ ’అని వ్యాఖ్యానించారని మంత్రి చెప్పారు. 1992లో కొంకణి, మణిపుర, నేపాలీ భాషలను రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూలులో చేర్చారని వివరించారు. ఆ తరువాత 2003 శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రభుత్వం భారతదేశంలో ప్రాంతీయ భాషల వికాసానికి తన దృఢతరమైన మద్దతును పునరుద్ఘాటించిందన్నారు. బోడో, డోగ్రీ, మైథిలీ, సంతాలీ భాషలను కూడా చేర్చుతూ అప్పటి ఉప ప్రధాని శ్రీ లాల్ కృష్ణ అద్వానీ ఒక సవరణను ప్రవేశపెట్టడం గమనిస్తే, గిరిజన సంస్కృతితోపాటు, గిరిజన విలువల పట్ల ప్రభుత్వానికి ఉన్న గౌరవం, నిబద్ధత దీని ద్వారా వ్యక్తమైందన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతీయ భాషల అభివృద్ధి అంశానికి మరింత ప్రాధాన్యం లభించిందని మంత్రి చెప్పారు. రాజ్యాంగ 370వ అధికరణాన్ని రద్దు చేసిన తరువాత కాశ్మీరీ, డోగ్రీ, ఉర్దూ, హిందీ, ఇంగ్లిషులకు జమ్మూ- కాశ్మీర్‌లో అధికార భాషలుగా గుర్తింపును ఇవ్వడంతో భారీ మద్దతు లభించిందన్నారు. ఈ నిర్ణయం స్థానిక ప్రజలకు సాధికారితను కల్పించడంతోపాటు వారిని ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చే ఒక ముఖ్య నిర్ణయంగా నిలిచిందని మంత్రి చెప్పారు.

భారతదేశ ప్రాచీన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ వస్తున్న శాస్త్రీయ భాషలపై కూడా తదేకంగా దృష్టి సారించారని మంత్రి ప్రధానంగా చెప్పారు. ప్రాచీన భాషలకు చారిత్రకంగా, సాంస్కృతికంగా ఉన్న గౌరవాన్ని ప్రతిబింబిస్తూ వాటికి ప్రాచీన భాష హోదాను ఇవ్వడానికి ప్రభుత్వం నిరంతర కృషి చేస్తూ వచ్చిందని శ్రీ కిషన్ రెడ్డి అన్నారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర మంత్రివర్గం 2024 అక్టోబరులో మరాఠీ, పాలీ, ప్రాకృత్, అస్సామీ, బెంగాలీ భాషలకు ప్రాచీన భాషల హోదాను ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదాన్ని తెలియజేయడంతో ప్రాచీన భాషలు మొత్తం 11కు పెరిగాయన్నారు. 11 ప్రాచీన భాషలున్న దేశం ప్రపంచంలో ఒక్క భారతదేశమేనని ఆయన తెలిపారు. ఈ భాషలను ప్రోత్సహించడానికి అనేక చర్యలు తీసుకొన్నారు. వాటిలో 2020లో సంస్కృతం కోసం మూడు కేంద్రీయ విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేయడం, పరిశోధనలు, అనువాదాల కోసం సెంట్రల్ క్లాసికల్ తమిళ్ ఇనిస్టిట్యూట్‌ను స్థాపించడం, మైసూరులోని భారతీయ భాషల కేంద్రీయ సంస్థ ఆధ్వర్యంలో కన్నడ, తెలుగు, మలయాళం, ఒడియా భాషల ప్రాచుర్యం కోసం ప్రత్యేక అధ్యయన కేంద్రాలను ఏర్పాటుచేయడం వంటి అనేక కార్యక్రమాలను అమలుచేశారని మంత్రి చెప్పారు. ఈ రంగంలో విజయాలను ప్రోత్సహించడానికి జాతీయస్థాయి, అంతర్జాతీయస్థాయి పురస్కారాలనూ, విశ్వవిద్యాలయ పీఠాలనూ, ప్రత్యేక కేంద్రాలనూ ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు.

ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) భారతీయ భాషలను ప్రోత్సహించే దిశలో ఒక పెద్ద పరివర్తనాత్మక నిర్ణయంగా మారిందని శ్రీ కిషన్ రెడ్డి అన్నారు. ఈ విధానంలో భాగంగా అయిదో తరగతి వరకు మాతృభాషలో లేదా స్థానిక భాషలో పాఠాలను బోధించాలి. అవసరమైనచోటల్లా ఎనిమిదో తరగతి వరకు ఇదే విధానాన్ని అవలంబించాలని స్పష్టంచేశారు. విద్యార్థినీ విద్యార్థుల్లో అవగాహనను పెంచడానికి, మేధోవికాసానికి, అధిక నాణ్యత కలిగిన పాఠ్య పుస్తకాలు, రెండు భాషలలో విద్యను నేర్పే పద్ధతులు అనుసరించాలని సిఫార్సు చేశారు. ఎస్‌టీఈఎమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం) రంగాలకు సంబంధించిన విద్యా బోధనలో, కెరియర్ కౌన్సిలింగ్‌లో ప్రాంతీయ భాషలను ఉపయోగించడాన్ని ప్రోత్సహించాలని, ఉన్నత విద్య సంస్థలలో సైతం స్థానిక భాషల్లో కోర్సులను అందించాలని ఎన్ఈపీ 2020 చెబుతున్నది. ఒక విద్యార్థి తన మాతృభాషలో చదువును నేర్చుకొన్నప్పుడు మరింత మెరుగైన అవగాహన, పరిశీలన శక్తి వికాసం, ఆత్మవిశ్వాసం పెంచుకోవడం అలవడతాయని ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన అధ్యయనాల్లో తేలింది. భారతదేశంలో దేశవాళీ సంస్కృతులను కాపాడుకోవడానికి, గిరిజన భాషలను పరిరక్షించుకొంటూ గిరిజన ప్రజల సంతానానికి మేలు కలిగేటట్లు చూడాలని కూడా ఈ విధానం సూచిస్తున్నది.

పాఠశాల విద్య స్థాయిలో భాషాభివృద్ధికి మద్దతివ్వడానికి 22 రాష్ట్రాలలో, కేంద్రపాలిత ప్రాంతాలలో 104 ప్రైమరీ బుక్స్ అందించారు. ఇవి బాలలు వారి మాతృభాషలోగానీ, స్థానిక భాషలోగాని విద్యను నేర్చుకొనేందుకు వీలు కల్పిస్తాయి. భారతీయ సంజ్ఞల భాష (ఐఎస్ఎల్)ను అభివృద్ధి పరిచారు. ఒకటో తరగతి మొదలు 12వ తరగతి వరకు బోధన కోర్సులను, పుస్తకాలను భారతీయ సంజ్ఞా భాషలలోకి అనువాదం చేశారు. 200లకు పైగా టీవీ చానళ్ళు, 29 భాషలలో విద్యా సంబంధమైన కార్యక్రమాలను అందిస్తున్నాయి. దీక్షా ప్లాట్‌ఫార్మ్ (DIKSHA platform) 133 భాషలలో, 3,66,370 ఈ-కంటెంట్ భాగాలను అందిస్తున్నది. ఈ భాషలలో 126 భారతీయ భాషలు, ఏడు విదేశీ భాషలు కూడా ఉన్నాయి. పుస్తకాలు చదివే అలవాటును ప్రోత్సహించడానికి జాతీయ డిజిటల్ గ్రంథాలయం, ‘ఉల్లాస్ యాప్’ (ULLAS App) వంటి కార్యక్రమాలను కూడా ప్రభుత్వం ప్రారంభించింది. అంతేకాకుండా, విద్యా విషయక వనరులను బహుళ భాషల్లో అందుబాటులో ఉండేటట్లు చూస్తోందని మంత్రి అన్నారు.

ఉన్నత విద్య రంగంలో కూడా చెప్పుకోదగ్గ పురోగతి ఉందని మంత్రి వివరించారు. 51 ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ సెంటర్లను ఏర్పాటుచేయడం, 1,500 అండర్‌గ్రాడ్యుయేట్ కోర్స్ పాఠ్య పుస్తకాలను 12 భారతీయ భాషలలోకి అనువాదం చేయడం, 8,000కు పైగా ఉన్నత విద్యాసంస్థల పాఠ్య ప్రణాళికలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్‌ను కలపడం వంటివి ఈ చర్యలలో కొన్ని అని ఆయన తెలిపారు. జేఈఈ (JEE), ఎన్ఈఈటీ (NEET), సీయూఇటీ (CUET) వంటి పోటీ పరీక్షలను ప్రస్తుతం ప్రాంతీయ భాషలలో నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ కోర్సులు ఎనిమిది భారతీయ భాషల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. దీనికి అదనంగా అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సుల విద్యార్థులు 19 కేంద్రీయ సంస్థలలో వారికి చెబుతున్న 428 ప్రోగ్రాములను 12 భారతీయ భాషలలో నేర్చుకొనే సౌలభ్యానికి నోచుకొన్నారు. అధ్యయన సామగ్రి ‘ఈ-కుంభ్’ (e-KUMBH), ‘అనువాదిని’ (Anuvadini) ప్లాట్‌ఫాంల ద్వారా లభ్యమవుతోంది.

అధికార భాషలలో ఒకటిగా ఉన్న హిందీ కూడా చెప్పుకోదగ్గ శ్రద్ధను దక్కించుకొంది. హిందీని ఒక అధికారిక భాషగా గుర్తించి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా ఈ భాషను ఇతర భారతీయ భాషలతోపాటే ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంది. వైవిధ్యాన్ని ఆదరిస్తూనే, భాషాపరమైన ఏకతకు పూచీ పడాలనేదే ఈ చర్యలోని ముఖ్యాంశం. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అంతర్జాతీయ వేదికలలో హిందీకి పట్టం కట్టారు. తద్వారా ప్రపంచవ్యాప్తంగా ఈ భాషకు ఉన్న గుర్తింపును పెంచడంతోపాటు భారతీయ భాషలకు వన్నె తెస్తున్నారు. మంత్రిత్వ శాఖలలో హిందీ సలహా సంఘాలు ఏర్పాటు చేయడం, దేశ విదేశాలలో టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (టీఓఎల్ఐసీ) లను ఏర్పాటు చేయడం, సమగ్ర “హిందీ శబ్ద్ సింధు” నిఘంటుకు రూపకల్పన చేయడం... ఈ చర్యలన్నీ పాలనలో, భావ ప్రసారంలో హిందీ పాత్రను పటిష్టం చేశాయి.

భారతీయ భాషలను మరింతగా వ్యాప్తిలోకి తీసుకురావడానికి సాంకేతిక మార్పులను వినియోగించుకుంటున్నారు. భాషాపరమైన అంతరాలను భర్తీ చేయడానికి డిజిటల్ టెక్నాలజీని నేషనల్ లాంగ్వేజ్ ట్రాన్స్‌లేషన్ మిషన్ తోపాటు ‘భాషిణి’ ప్రాజెక్టు కూడా ఉపయోగించుకొంటున్నాయి. ఫలితంగా వేరు వేరు భాషలలో మాట్లాడే వ్యక్తుల మధ్య భావ ప్రసారం ఎలాంటి అంతరాయం లేకుండా చోటుచేసుకొంటోంది. ప్రాంతీయ భాషలలో డిజిటల్ మాధ్యమం ద్వారా జ్ఞాన బోధక సామగ్రిని రూపొందించవలసిందిగా విద్యా సంస్థలను, ఎడ్యు-టెక్ కంపెనీలను ప్రోత్సహించారు. దీనితో విద్య మరింత మంది చెంతకు చేరుకోవడం సులభమవుతుంది.

‘ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్’ కార్యక్రమంలో భాగంగా ‘సౌరాష్ట్ర తమిళ్ సంగమం’, ‘కాశీ తమిళ్ సంగమం’ వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం భారతదేశానికున్న భాషాపరమైన, సంస్కృతిపరమైన ఐకమత్యాన్ని పండుగల జరుపుకోవడం వంటిదే. ఈ కార్యక్రమాలు ప్రాంతాల మధ్య చారిత్రకంగా ఉన్న సంబంధాలను ప్రముఖంగా చాటి చెప్పడంతోపాటు సాంస్కృతిక ఆదాన- ప్రదానాన్ని కూడా ప్రోత్సహిస్తున్నాయి. ప్రపంచంలో అత్యంత ప్రాచీన భాషలలో ఒకటైన తమిళ భాషను పరిరక్షించుకోవడంపై ప్రధానమంత్రి చూపుతున్న శ్రద్ధ భారతీయులు వారి భాషా వారసత్వాన్ని పదిలపరచుకొంటూ, సుసంపన్నం చేయడం వారి సమష్టి బాధ్యత అనే అంశాన్ని స్పష్టం చేస్తోంది.

భారతీయ భాషలన్నీ ప్రపంచవ్యాప్తంగా పోటీ పడగలిగేటట్లుగాను, ఆధునిక విద్య ప్రాంతీయ భాషలన్నింటిలో అందుబాటులో ఉండేటట్లుగాను జాగ్రత్త చర్యలు చేపట్టడం ప్రభుత్వ దార్శనికతలో భాగాలే. భాషాధారిత పర్యటన అవకాశాలు, సాహితీ ఉత్సవాలు, భాషాపరమైన పరిశోధనల వంటి కార్యక్రమాలు ప్రపంచ రంగస్థలంపై భారత భిన్నత్వాన్ని ప్రదర్శించాలన్న ధ్యేయంతో చేపడుతున్న కార్యక్రమాలు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ‘మన్ కీ బాత్’లో “మనం మన తల్లిని ఎలాగైతే విడచిపెట్టలేమో, అదే విధంగా మన మాతృభాషను కూడా వదిలిపెట్టలేం” అని చెప్పిన మాటలు ఎంతో సరైనవి. భాషలు కొన్ని మాటల కూర్పు మాత్రమే కాదు, అవి తరాలనూ, సముదాయాలనూ కలిపే వంతెనలు అని మంత్రి అన్నారు. భాషకు ఉన్న గౌరవాన్ని పెంచుకోవడం ద్వారా, టెక్నాలజీకున్న శక్తిని

మొదటి పేజి తరువాయి భాగం

భాషా పరిరక్షణకు, భాషా ప్రచారానికి ఉపయోగించుకోవడం ద్వారా ఒక చైతన్యభరిత సమైక్య భవిష్యత్తుకు భారత్ బాట వేస్తోంది. భారతీయ భాషలను అభివృద్ధి పరచడానికి, సాంస్కృతిక భాషా సంపదను అక్కున చేర్చుకొని దేశ ప్రజలను 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం) మార్గంలో ముందుకు నడిపించాలన్న ఆశయ సాధనకు ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని మంత్రి అన్నారు.

# అండమాన్ నికోబార్ లోని దీవులకు మన వీరుల పేర్లు పెట్టడమంటే వారి సేవలు భవిష్యత్ తరాలకు గుర్తుండేలా చేయడమే: ప్రధానమంత్రి

•మూలాలతో అనుసంధానమైన దేశాలు అభివృద్ధి, దేశ నిర్మాణంలో ముందుంటాయి: ప్రధానమంత్రి

**రిపబ్లిక్ హిందుస్థాన్ , ఢిల్లీ :**




అండమాన్ నికోబార్ ప్రాంతంలోని దీవులకు మన వీరుల పేర్లు పెట్టడమన్నది దేశానికి వారందించిన సేవలు భవిష్యత్ తరాలకు గుర్తుండేలా చూసే మార్గమని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. మూలాలతో అనుసంధానమై ఉన్న దేశాలు అభివృద్ధి, జాతి నిర్మాణంలో ముందున్నాయని ఆయన అన్నారు.

సామాజిక మాధ్యమం ఎక్స్ లో శివ్ అరూర్ చేసిన ఓ పోస్టుపై స్పందిస్తూ ఆయన ఇలా వ్యాఖ్యానించారు:

"అండమాన్, నికోబార్‌లోని దీవులకు మన యోధుల పేర్లను పెట్టడమన్నది దేశానికి వారు చేసిన సేవలను రాబోయే తరాలు గుర్తుంచుకునే మార్గం. దేశ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మన స్వాతంత్ర్య సమరయోధులు, విశిష్ట వ్యక్తుల జ్ఞాపకాలను పదిలపరచి, వాటిని ఘనంగా చాటే మా విస్తృతమైన కృషిలోనూ ఇది భాగం.

అన్నిటికీ మించి, మూలాలతో అనుసంధానమైన దేశాలే అభివృద్ధిలో, జాతి నిర్మాణంలో ముందుకు సాగుతాయి.

నామకరణ కార్యక్రమంలో నా ప్రసంగాన్ని కూడా ఇక్కడ జతచేస్తున్నాను https://www.youtube.com/watch?v=-8WT0FHaSdU.

అలాగే, అండమాన్-నికోబార్ దీవులను ఆస్వాదించండి. సెల్యులార్ జైలును కూడా సందర్శించండి, యోధుడు వీర సావర్కర్ ధైర్యసాహసాల నుంచి స్ఫూర్తిని పొందండి".

# పార్లమెంటులో ప్రశ్న -- భారత్ జెన్ ప్రారంభం

**రిపబ్లిక్ హిందుస్థాన్ , ఢిల్లీ :**

భారత్ జెన్ అన్నది బృహత్తరమైన బహుభాషా విస్తృత నమూనా కార్యక్రమం. భారతదేశ భాషా, సాంస్కృతిక, సామాజిక-ఆర్థిక వైవిధ్యానికి తగినట్టుగా ఇది అధునాతన ఉత్పాదక కృత్రిమ మేధ నమూనాలను రూపొందిస్తుంది. ప్రధానంగా సమాచార సేకరణపై దృష్టిసారించి 'భారత్ డేటా సాగర్' అనే కార్యక్రమాన్ని భారత్ జెన్ ప్రారంభించింది. తద్వారా కృత్రిమ మేధ నమూనాలు భారత భాషా వైవిధ్యాన్ని ప్రతిబింబించేలా చూస్తోంది. సమాచార నమూనాల్లో తక్కువ ప్రాతినిధ్యం ఉన్న భారతీయ భాషల్లో.. శిక్షణ కోసం అవసరమైన సమాచారాన్ని అందుబాటులోకి తేవడానికి ఈ సేకరణ ద్వారా కృషి చేస్తోంది.

భారత్ జెన్ దేశవ్యాప్తంగా పరిశోధన బృందాలతో భాగస్వామ్యాన్ని ఏర్పరచుకుని.. రూపొందుతున్న ఈ ఉత్పాదక కృత్రిమ మేధ నమూనాల పరిధిని వారి ద్వారా విస్తరింపజేసేలా చూస్తోంది. దానితోపాటు వాటిని మరింత అభివృద్ధి చేసి, వినియోగాన్ని పెంచడం కోసం పరిశోధక బృందాలతోపాటు విద్యేతర సమూహాలకు విస్తృతంగా అందుబాటులో ఉంచుతోంది.

సమర్థవంతమైన నిర్వహణ సన్నద్ధతతోపాటు దేశంలోని అట్టడుగు - అల్ప ప్రాతినిధ్య సమూహాలు సహా విస్తృత ప్రజానీకానికి వినియోగానికి





అందుబాటులో ఉండేలా ప్రభుత్వం, పారిశ్రామిక సమూహాలు, అంకుర సంస్థలతో కూడా భారత్ జెన్ భాగస్వామ్యాలను ఏర్పరచుకుంటోంది.

సాంస్కృతిక గుర్తింపు, ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహించడం కోసం.. స్థానిక భాషలు, మాండలికాలలో నిరంతరాయంగా అనువదించడం ద్వారా ప్రాంతాలకు తగిన విషయాంశాల అభివృద్ధికి తోడ్పడే సాంకేతికతలు, సాధనాలను భారత్ జెన్ అందుబాటులోకి తెస్తోంది.

బాంబే ఐఐటీ, హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ, మండి ఐఐటీ, కాన్పూర్ ఐఐటీ, హైదరాబాద్ ఐఐటీ, ఇండోర్ ఐఐఎం, మద్రాస్ ఐఐటీ సహా దేశంలోని ప్రధాన విద్యా సంస్థల్లోని అగ్రశ్రేణి కృత్రిమ మేధ పరిశోధకులతో కూడిన కన్సార్టియం భారత్ జెన్ లో ఉంటుంది. దేశంలోని భాషా, సాంస్కృతిక వైవిధ్యంతోపాటు పౌర సమ్మిళితత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పరిశోధక బృందాలు ప్రభుత్వం, పారిశ్రామిక సమూహాలు, అంకుర సంస్థల భాగస్వామ్యంతో వివిధ నమూనాలను అభివృద్ధి చేస్తున్నాయి. తద్వారా దేశంలోని వివిధ సామాజిక-ఆర్థిక సమూహాలకు సాంకేతికతను సమానంగా అందుబాటులోకి తెచ్చేలా చూస్తోంది.

కేంద్ర శాస్త్ర – సాంకేతికత సహాయ (స్వతంత్ర హోదా), భూ విజ్ఞాన శాఖల మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ లోకసభలో ఇచ్చిన ఓ లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారాన్ని అందించారు.

## నేటి రాశి ఫలాలు - 2024

| | |
|---|---|
| **మేష రాశి (Aries):**   | కొత్త అవకాశాలు ఎదురవుతాయి. సానుకూల దృక్పథంతో ముందుకు సాగండి |
| **వృషభ రాశి (Taurus):**   | కుటుంబంతో గడపడానికి సమయం. మనస్సుకు ప్రశాంతత మరియు ఆనందం పొందవచ్చు. |
| **మిథున రాశి (Gemini):**   | సమర్థవంతమైన సంభాషణల ద్వారా వృత్తి పరంగా మంచి అవకాశాలు పొందవచ్చు. |
| **కర్కాటక రాశి (Cancer):**   | మీ ఆరోగ్యం పై దృష్టి పెట్టండి. మంచి ఆహారపు అలవాట్లు పాటించండి. |
| **సింహ రాశి (Leo):**   | సృజనాత్మక ప్రాజెక్టుల ప్రారంభానికి అనుకూల దినం. |
| **కన్య రాశి (Virgo):**   | పాత స్నేహితులతో మళ్ళీ కలుసుకోవడం ద్వారా ఆనందాన్ని పొందవచ్చు. |
| **తుల రాశి (Libra):**   | ఫైనాన్షియల్ డిసిజన్స్ తీసుకోవడానికి మంచి సమయం. వ్యాపారంలో విజయాలు పొందవచ్చు. |
| **వృశ్చిక రాశి (Scorpio):**   | మీరు ఏవైనా సవాళ్లను ఎదుర్కొనవచ్చు కానీ ధైర్యంతో వాటిని అధిగమించవచ్చు. |
| **ధనుస్సు రాశి(Sagittarius):**   | ప్రయాణాలకి అనుకూల సమయం. సరికొత్త అనుభవాలు పొందవచ్చు. |
| **మకర రాశి (Capricorn):**   | వృత్తి పరంగా మీరు మంచి గుర్తింపు పొందవచ్చు. మీ కృషి ఫలితాలు ఇస్తాయి. |
| **కుంభ రాశి (Aquarius):**   | స్నేహితులతో సమయం గడపడం ఆనందాన్ని ఇస్తుంది. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనండి. |
| **మీన రాశి (Pisces):**   | మీరు సృజనాత్మక ప్రాజెక్టులపై మంచి అభివృద్ధి సాధించవచ్చు. ఆత్మవిశ్వాసంతో పనిచేయండి. |

నోట్ : ఇవి సాధారణ సూచనలు మాత్రమే. వాస్తవ ఫలితాలు మీ వ్యక్తిగత పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. మీరు మరింత సమాచారం కోసం ఆసక్తి చూపించవచ్చు.

Printed , Published , Edited and Owned by Rathod Raju , Printed at Jal Bhavani Printing Press (Individual EDITOR And owner of printing press ) , H.No. 2-42 , Village : Jamidi Mdi . Ichoda Dist . Adilabad . , State : Telangana , Pin code - 504 307 ( T.S. ) , RNI Reg.No: TELTEL/2021/83468 EDITOR : RATHOD RAJU , Contact Numbers : 9908940762 , 8985614333 . Email : rhdaily.in@gmail.com .web : www.republichindustan.com